# 26న మునుగోడుకు గులాబీ దళపతి

- ప్రజా ఆశీర్వాద సభకు రానున్న సీఎం కేసీఆర్
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే కూసుకుంట్ల
- భారీగా తరలొచ్చేందుకు జనం సన్నద్ధం



మునుగోడు మండల కేంద్రంలో ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 22(నమస్తే తెలంగాణ) : ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభ కావడంతో దీన్ని గ్రాండ్ సక్సెస్ చేయాలన్న పట్టుదలతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సభకు ప్రజా ఆశీర్వాద సభ అని నామకరణం చేయగా పలు బృందాలు సభ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఐదు రోజులుగా సభా స్థలాన్ని సిద్ధం చేయడంతో పాటు వేదిక నిర్మాణ పనులు కూడా మొదలుపెట్టారు. సభా స్థలంతోపాటు పార్కింగ్ స్థలాలను కూడా ఎంపిక చేసి చదును చేస్తున్నారు. ఈ నెల 26న సీఎం కేసీఆర్ ముందుగా అచ్చంపేట, నాగర్‌కర్నూల్ బహిరంగసభల్లో ప్రసంగించిన అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు మునుగోడుకు చేరుకోనున్నారు. సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో రానున్న నేపథ్యంలో సభా వేదికకు ఒక వైపున మూడెకరాల్లో హెలిప్యాడ్‌ను సిద్ధం చేస్తున్నారు. హెలిప్యాడ్‌తో పాటు బందోబస్తు ఏర్పాట్లును జిల్లా ఎస్పీ అపూర్వరావు పర్యవేక్షిస్తున్నారు. హెలిప్యాడ్ నుంచి సభికులకు ఇబ్బంది లేకుండా నేరుగా సభా వేదికకు కేసీఆర్ చేరుకునేలా ప్రత్యేకంగా రహదారిని ఏర్పాటు చేస్తున్నారు.

ఇక బహిరంగసభకు 50వేల మందికి పైగా తరలివచ్చే అవకాశాలు కనిపిస్తుండడంతో అందుకు అనుగుణంగా సభా స్థలాన్ని ఎంపిక చేశారు. దీన్నంతటిని ఇప్పటికే చదును చేసి సిద్ధం చేశారు. ఈ స్థలంలో భారి కేడ్లు, ఇతర ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. సభా వేదిక స్థలం, సభకు వచ్చే వారు కూర్చునే స్థలం, లోపలికి సులువుగా ప్రవేశించేలా దారులు ఇలా అనేక జాగ్రత్తలు తీసుకుని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇక నియోజకవర్గ వ్యాప్తంగా సభకు వచ్చే వాహనాలను సైతం ఎక్కడికక్కడే పార్క్ చేసే విధంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాట్లు చేశారు. మునుగోడుకు మూడు వైపులా విశాలమైన ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలను ఎంపిక చేశారు. వీటిని కూడా ఇప్పటికే చదును చేసి సిద్ధం చేశారు. ఎటు వైపు నుంచి వచ్చే వాహనాలు ఆ వైపే నిలిపి అక్కడి నుంచి ప్రజలకు సభాస్థలికి చేరుకునేలా జగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇక సభకు హాజరయ్యే జనానికి కూడా మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు కూడా విస్తృతంగా అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఉప ఎన్నికల అనంతరం జరుగుతున్న మరో ఎన్నికల సభ కావడంతో ఈ సభకు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. గతేడాది ఆగస్టులో అప్పటి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అభివృద్ధి పేరుతో తన పదవికి రాజీనామా చేస్తే ఉప ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో రాజగోపాల్‌రెడ్డి తన వ్యక్తిగత అవసరాల రీత్యా కాంగ్రెస్ నుంచి కాకుండా బీజేపీ నుంచి బరిలోకి దిగారు. పైకి అభివృద్ధి పేరు చెప్పగా లోపల తన వ్యాపార ఆర్థిక అవసరాల కోసమే ఉప ఎన్నిక తెచ్చిపెట్టారని భావించిన మునుగోడు ప్రజలు ఆయనకు ఊహించని షాక్ ఇస్తూ తీర్పును ఇచ్చారు. మునుగోడు అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే ముడిపడి ఉందని స్పష్టం చేస్తూ ప్రజలు ఎమ్మెల్యేగా కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించుకున్నారు. 2014 నుంచి 2018వరకు బీఆర్‌ఎస్‌లో జరిగిన అభివృద్ధి తప్పా 2018లో రాజగోపాల్‌రెడ్డి గెలిచి. ఉప ఎన్నిక వచ్చే వరకు జరిగిన అభివృద్ధి ఇక్కడ శూన్యం. దాంతో ఉప ఎన్నికల్లో మునుగోడు అభివృద్ధిని కాంక్షిస్తూ బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టారు.

**50వేల మందికి పైగా తరలివచ్చే అవకాశం**

## సీఎం కేసీఆర్ సభకు ఏర్పాట్లు పరిశీలన

మునుగోడు : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఈ నెల 26న మునుగోడులో జరిగే ప్రజా ఆశ్వీరాద బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సభస్థలాన్ని ఆదివారం పరిశీలించి పలు సూచనలు చేశారు. చౌటుప్పల్ రోడ్డులోని ఎంపీడీఓ కార్యాలయంలో సమీపంలో సభ నిర్వహణకు పార్టీ శ్రేణులు సన్నద్ధమవుతున్నారు. సభకు జననేత మునుగోడుకు వస్తుండడంతో గులాబీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బండ పురుషోత్తం రెడ్డి, బీఆర్ ఎస్ నాయకులు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, పందుల పవిత్రాశ్రీను, బీసం మల్లేశ్, కొమ్ము కృష్ణయ్య, మహ్మద్ వాజీద్, పెరుమాళ్ల ప్రణయ్ కుమార్, దోటి కరుణాకర్,ఐతగోని విజయ్, దుబ్బ రవి, వనం సురేశ్, నకిరేకంటి వెంకన్న, గాలిబాబు ఉన్నారు.

## 600 కోట్లతో అభివృద్ధి పనులు

గతేడాది కాలంలోనే అనేక అభివృద్ధి పనులకు మునుగోడులో శ్రీకారం చుట్టారు.సుమారు రూ.600 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. చౌటుప్పల్‌లో 100 పడకల ఆస్పత్రి, మర్రిగూడలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్, గ్రామాల్లో అంతర్గత రోడ్లు, బీటీరోడ్లు, ఆర్అండ్‌బీ రోడ్లు, సోలిపురం బ్రిడ్జి, చండూరు, చౌటుప్పల్ మున్సిపాలిటీల్లో రూ.75 కోట్లతో రహదారులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, నారాయణపురం, గట్టుప్పల్, తేరటుపల్లిల్లో చేనేత క్లస్టర్ల ఏర్పాటు, నారాయణపురంలో గిరిజన భవనం, గిరిజన గురుకుల పాఠశాల ఏర్పాటు, తండాల్లో ప్రత్యేకంగా రూ.25కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం ఇలా అనేక అభివృద్ధి పనులు ఈ ఏడాది కాలంలోనే శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే మునుగోడులో ఫ్లోరైడ్‌ను పారదోలిన ఘనత బీఆర్‌ఎస్ సొంతం చేసుకుంది. శాశ్వత పరిష్కారం దిశగా డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా శివన్నగూడెం, లక్ష్మాణపురం రిజర్వాయర్ల నిర్మాణాలు 70శాతం పూర్తి చేసింది. వీటన్నింటి నేపథ్యంలో మునుగోడులో జరుగనున్న ప్రజా ఆశీర్వాద బహిరంగసభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారు. సభకు విస్తృత ప్రచారం కల్పిస్తూ మండలాల వారీగా పార్టీ నేతలంతా క్షేత్రస్థాయిలో పర్యటించి పార్టీ శ్రేణులతో మమేకం అయ్యారు. పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడంతో పాటు సామాన్య జనం సభకు వచ్చేలా చూస్తున్నారు. ఈ సభను విజయవంతం చేయడం ద్వారా మునుగోడు అభివృద్ధి టీఆర్‌ఎస్‌తోనే ముడిపడి ఉందని, మునుగోడు గడ్డ బీఆర్‌ఎస్ అడ్డ అని చాటి చెప్పేందుకు పార్టీ యావత్తు పనిచేస్తున్నది. అందువల్లనే సీఎం కేసీఆర్ సభకు ప్రతీ ఊరువాడా నుంచి జనం తరలివచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. క్షేత్ర స్థాయిలోనూ భారీగా జనం తరలివచ్చేలా పరిస్థితులు కనిపిస్తుండడంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లను చేస్తున్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తమ సొంత వాహనాలపై తరలివచ్చేందుకు సన్నద్ధం అవుతున్నారు. చౌటుప్పల్, నారాయణపురం, మర్రిగూడెంలతో పాటు గట్టుప్పల్ మండలాల వారు కొంపల్లి వైపు నుంచి, నాంపల్లి, చండూరు మండలాల వారు చండూరు రూట్‌లో ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీనికి అనుగుణంగా పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు. సభకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు సభా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి వివరించారు. అభివృద్ధి ప్రదాత కేసీఆర్‌కు ఘనస్వాగతం తెలపడంతో పాటు సభను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

# జిల్లా ప్రజలకు మంత్రి జగదీశ్‌రెడ్డి దసరా శుభాకాంక్షలు



జిల్లా ప్రజలకు విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునే వరకు విశ్రమించకూడదనే స్ఫూర్తితో.. చెడు మీద మంచి సాధించిన విజయానికి సంకేతంగా విజయదశమి జరుపుకుంటామని ఆయన పేర్కొన్నారు. దసరా రోజున పాలపిట్టను దర్శించి, పవిత్రమైన జమ్మిచెట్టుకు పూజలు చేసే సంప్రదాయం గొప్పదని పేర్కొన్నారు. జమ్మి ఆకును బంగారంలా భావించి పంచుకొంటూ, పెద్దల ఆశీర్వాదాలను అందుకుంటూ, అలయ్ బలయ్ తీసుకొంటూ ప్రేమాభిమానాలను చాటుకోవడం దసరా పండుగ ప్రత్యేకత అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అనతికాలంలోనే అభివృద్ధిని సాధించి రాష్ట్రాన్ని ముందంజలో నిలిపిన తెలంగాణ పాలన, దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. విజయానికి సం కేతమైన దసరా నాడు తలపెట్టిన కార్యాలన్నీ ఫలించాలని ఆకాంక్షించారు. విజయ దశమి స్ఫూర్తిని కొనసాగిస్తామని తెలిపారు. ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో జీవించేలా ప్రజలను దీవించాలని కనకదుర్గమ్మను మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రార్థించారు.

# కోదాడలో గులాబీ గుబాళింపు

- విజయమే లక్ష్యంగా నేతల సమన్వయం
- మంత్రి కేటీఆర్ సమక్షంలో తొలగిన అసమ్మతి రాగం
- బొల్లం మల్లయ్య గెలుపునకు నాయకులు కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, వనపర్తి లక్ష్మీనారాయణ సంపూర్ణ సహకారం
- ఇప్పటికే మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గంలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

సూర్యాపేట, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ) : త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడలో బీఆర్‌ఎస్ జెండా ఎగురడం ఖాయమైంది. కోదాడ నాయకుల్లో నెలకొన్న చిన్న చిన్న వ్యక్తిగత బేధాభిప్రాయాలపై మంత్రి జగదీశ్‌రెడ్డి, నియెజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు వరుసగా రెండు రోజులు చర్చలు చేసి సమన్వయం చేస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు జనం బీఆర్‌ఎస్ వైపు ఉండగా నాయకత్వంలో భేదాభిప్రాయాలు ఉండవద్దని, పార్టీ కోసం పని చేసే వారికి తగిన ప్రాధాన్యతను ఇస్తామని కేటీఆర్ అసమ్మతి నేతలకు చెబుతున్నారు. కాగా మంత్రి జగదీశ్‌రెడ్డి, నియెజక వర్గ ఇన్‌చార్జీ, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు శనివారం నాడు కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త, సూర్యాపేట జిల్లా పెరిక సంఘం నాయకుడు వనపర్తి లక్ష్మీనారాయణను వెంటబెట్టుకుని కేటీఆర్‌ను కలిశారు. ఆదివారం నియెజక వర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యాయాదవ్ కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డిని హైదరాబాద్ ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిశారు. మలిదశ ఉద్యమంలో కోదాడ నియోజక వర్గంలో చురుకుగా పనిచేసిన శశిధర్‌రెడ్డి 2014 ఎన్నికల్లో ఓటమి పాలుకాగా తదనంతరం మంత్రి జగదీశ్‌రెడ్డి చొరవతో మార్కెట్ కమిటీ చైర్మన్ అయ్యారు. 2018లో జరిగిన ఎన్నికల్లో కొన్ని రాజకీయ పరిణామాల వల్ల బొల్లం మల్లయ్యయాదవ్‌కు టికెట్ కేటాయిస్తే అందరూ కలిసి గెలిపించారు. మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి సహకారంతో ఎవరూ ఊహించని రీతిన ఐదేళ్ల కాలంలో నియోజక వర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు దాదాపు రూ.3,500 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. అయితే ఈసారి ఎన్నికల్లో నియోజకవర్గ ఇన్‌చార్జీగా పనిచేసిన కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి టిక్కెట్ ఆశించారు. రాజకీయ సమీకరణలతో అధిష్టానం తిరిగి బొల్లం మల్లయ్యయాదవ్‌కు టిక్కెట్ ఖరారు చేయడంతో శశిధర్‌రెడ్డి వర్గం కాసింత అలకబూనింది. దాంతో శని, ఆదివారాల్లో చేసిన సమాలోచనల్లో నాయకుల మధ్య చోటుచేసుకున్న సమస్యలకు చెక్ పడింది. వ్యక్తిగత బేధాభిప్రాయాలు పక్కన పెట్టి పార్టీ విజయం కోసం పని చేయాలని మంత్రి కేటీఆర్ సూచించారు. దాంతో అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పార్టీ అభ్యర్థి బొల్లం మల్లయ్య యాదవ్ గెలుపునకు కృషి చేస్తామని కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, వనపర్తి లక్ష్మీనారాయణ అన్నారు. కోదాడ నియోజక వర్గంలో మళ్లీ బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తామని పేర్కొన్నారు.

# వడివడిగా కస్తూర్బా భవన నిర్మాణం

- రూ.2.25 కోట్లతో కంపాసాగర్‌లో నిర్మాణం
- భవనం పూర్తయితే తీరనున్న విద్యార్థినుల ఇబ్బందులు

త్రిపురారం, అక్టోబర్ 22 : మండలంలోని కంపాసాగర్‌లో ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్ ఆవరణలో నిర్మిస్తున్న కస్తూర్బా పాఠశాల భవనం పనులు వేగంగా సాగుతున్నాయి. రూ.2.25 కోట్లతో భవన నిర్మాణం చేపడుతున్నారు. జనవరి 27న స్థానిక ఎమ్మెల్యే నోముల భగత్ భవనానికి శంకుస్థాపన చేయగా.. ఇప్పటికి 90శాతం పనులు పూర్తయ్యాయి. వచ్చే జనవరి లేదా ఫిబ్రవరిలో పాఠశాలను ప్రారంభించేలా కసరత్తు చేస్తున్నట్లు ఎంఈఓ బాలాజీనాయక్ తెలిపారు.

## రూ.2.25 కోట్లతో నిర్మాణం

మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో కస్తూర్బా పాఠశాల ఏర్పాటు చేయగా.. అక్కడ నీటి సౌకర్యం సరిగా లేక పోవడంతో బాబుసాయిపేట ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. అయితే పాఠశాలకు సొంత భవనం కోసం కంపాసాగర్ శివారులో ఉన్న మోడల్ పాఠశాల ఆవరణలో స్థలాన్ని ఎమ్మెల్యే నోముల భగత్ కేటాయించారు. ఎమ్మెల్యే చొరవతో పెద్దదేవులపల్లిలోని డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ఫౌండేషన్ వారు రూ.2.25 కోట్లతో భవనాన్ని నిర్మిస్తున్నారు. పది నెలల్లోనే అన్ని వసతులతో కూడిన భవన నిర్మాణ పనులు తుది దశకు చేరాయి. మరో రెండు నెలల్లో పనులు పూర్తి చేసి ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. దాంతో విద్యార్థినులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.